సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



సమస్యలు పరిష్కరించాలి

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. 8లో▸



నిమ్స్‌లో బ్యాటరీ కార్లు

నిమ్స్‌లో ట్రాఫిక్ సమస్యతో పాటు శబ్ద, వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు బ్యాటరీ కార్లను ప్రవేశపెట్టారు. 8లో▸

'ఓపెన్' గడువు పెంపు

ఇబ్రహీంపట్నం: డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2023–24 సంవత్సరానికి గాను డిగ్రీ అడ్మిషన్ల గడువును సెప్టెంబర్ 5 వరకు పెంచినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభు, అభ్యాస సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డా.నాగోజీ తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, రెండేళ్లపాటు ఐటీఐ, డిప్లమా పూర్తి చేసి ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 73829 29772.

న్యూస్‌రీల్

రేపు గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

మొయినాబాద్ రూరల్: ఇంటర్మీడియెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాలకు ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. చేవెళ్ల నాన్ సీఈవో కళాశాలలో ఇంటర్మీడియెట్ ఎంపీసీలో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. చిలుకూరు బాలాజీ సమీపంలోని గురుకుల పాఠశా లలో ఇంటర్మీడియెట్ ఎంపీసీలో స్పాట్ అడ్మిష న్స్ ఉంటాయన్నారు.2022–23లో 10వ తర గ తి పూర్తి చేసిన విద్యార్థినులు 21న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు.

ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చేసుకోండి

తుర్కయంజాల్: ఆసక్తి ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌ల నిర్వాహకులు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం గురించి పీహెచ్‌సీల్లో పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు తగిన శిక్షణ ఇచ్చామని, రిజిస్ట్రేషన్ కాపీ, ఎలక్ట్రిసిటీ బిల్, క్లినిక్ ఫొటో తదితర కాపీలతో దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి, పోర్టల్‌లో నమోదు చేసు కుని గుర్తింపు నంబర్‌ను పొందాలని సూచించారు. జిల్లాలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్,డిప్యూటీ డీఎంహెచ్ఓలు తగిన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు.

ఆర్టీసీకి ఉద్యోగులు మూల స్తంభాలు



ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేసిన షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ సంస్థకు ఉద్యోగులు మూలస్తంభాలని, ప్రతి ఉద్యోగి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని డిపో మేనేజర్ ఉష అన్నారు. డిపోలో జూలైలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, మెకానిక్‌లను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉష మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తే సంస్థ లాభాల బాటలోకి వెళ్తుందని అన్నారు. ప్రయాణికులకు అనుకూలంగా బస్సులు నడిపించాలని, వారు కోరిన చోట బస్సులను నిలపాలని సూచించారు. ప్రజలు ప్రైవేట్ వాహనాలవైపు వెళ్లకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

26న మంచిరేవులలో హరితహారం

- పాల్గొననున్న సీఎం కేసీఆర్
- ఏర్పాట్లను పరిశీలించిన సీఎస్ శాంతి కుమారి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్ శాంతి కుమారి,చిత్రంలో కలెక్టర్ హరీశ్ తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: హరితహారంలో భాగంగాఈ నెల 26న మంచిరేవులలోని ఫారెస్ట్ ట్రెక్ పార్కులో 2 వేల మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొంటున్న సందర్భంగా ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం పరిశీలించారు. సీఎం మొక్కలు నాటేందుకు ఎంపిక చేసిన ప్రాంతంలో గుంతలు తవ్వాలని, తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు 4,30,500 మొక్కలు నిర్దేశించడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, కలెక్టర్ హరీశ్, సైబరాబాద్ అడిషనల్ సీపీ అవినాష్, జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, పోలీసు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కన్నతండ్రే కాలయముడై..



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ భీంరెడ్డి



హత్యకు గురైన మోక్షజ (ఫైల్)



నిందితుడు చంద్రశేఖర్

భార్యపై కోపంతో కూతురిని చంపిన తండ్రి

- స్కూలు నుంచి తీసుకెళ్లి.. బ్లేడ్‌తో గొంతు కోసిన వైనం
- రక్తపు మడుగులో విలవిల్లాడిన చిన్నారి
- నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహాన్ని పడేసేందుకు యత్నం
- ఓఆర్ఆర్‌పై తిరుగుతూ.. పోలీసులకు చిక్కిన నిందితుడు

అబ్దుల్లాపూర్‌మెట్/హస్తినాపురం: కన్న తండ్రే కాలయముడయ్యాడు. భార్యపై ఉన్న కోపంతో సొంత కూతురినే హతమార్చాడు. చదువుకునేందుకు స్కూలుకు వెళ్లిన చిన్నారిని.. కారులో ఎక్కించి వెంట తెచ్చిన బ్లేడుతో గొంతు కోశాడు. బీహెచ్ఈఎల్ పరిధిలో చోటు చేసుకున్న ఈ అమానవీయ ఘటన శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో వెలుగు చూసింది. కన్నపేగు తెంచుకు పుట్టిన బిడ్డ కళ్లముందు విగతజీవిగా కన్పించడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది.

మూడేళ్ల క్రితం అమెరికా నుంచి వచ్చి..

చందానగర్‌కు చెందిన చంద్రశేఖర్(40)కి బీహెచ్ఈఎల్‌కు చెందిన హిమబిందుతో 2011లో వివాహమైంది. ఇద్దరూ కొంత కాలం అమెరికాలో ఉన్నారు. వీరికి ఎనిమిదేళ్ల కుమార్తె మోక్షజ ఉంది. మూడేళ్ల క్రితం వీరు అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అప్పటికే వీరిద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. దీంతో ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. హిమబిందు తన కుమార్తె మోక్షజతో కలిసి బీహెచ్ఈఎల్‌లోని తన తల్లిగారి ఇంట్లో ఉంటుంది. స్థానికంగా ఉన్న జ్యోతి విద్యాలయంలో కుమార్తెను నాలుగో తరగతి చదివిస్తోంది. చంద్రశేఖర్ చందానగర్‌లో ఒంటరిగా ఉంటున్నాడు. కూతురు చదువుతున్న స్కూలుకు ఆయన అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్లేవాడు. భార్యతో నెలకొన్న విభేదాలతో ఇటీవల ఓ సైకోలా మారాడు.

వారం రోజుల క్రితమే పన్నాగం

ఎలాగైనా తల్లీకూతుళ్లను హతమార్చాలని చంద్రశేఖర్ పన్నాగం పన్నాడు. ఆ మేరకు వారం రోజుల క్రితం చందానగర్‌లో పదునైన పెన్సిల్‌చాకుతో పాటు పేపర్ కట్టర్ కత్తి(బ్లేడ్)ని కొనుగోలు చేసి కారులో పెట్టుకున్నాడు. అదును కోసం ఎదురు చూశాడు. శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో తన కూతురు చదువుతున్న స్కూల్‌కు వెళ్లి..ఆమెను బయటికి తీసుకొచ్చాడు. కారులో ఎక్కించుకుని వెంట తెచ్చుకున్న పదునైన బ్లేడ్‌తో గొంతుకోసి హత్య చేశాడు. చిన్నారి మోక్షజ రక్తపు మడుగులో గిలగిలా కొట్టుకుని ప్రాణాలను వదిలిపెట్టింది. మృతదేహాన్ని నిర్మానుష్య ప్రదేశంలో పడేసేందుకు యత్నించాడు. మృతదేహాన్ని కారులో ఉంచి రాత్రి 10.30 గంటల సమయంలో కోహెడ శివారుకు చేరుకున్నాడు. ఔటర్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పాటు ఆయన ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. మృతదేహాన్ని తరలిస్తున్న కారుకు ముందు భాగంలోనే మరో కారు టైర్ పేలడంతో నిలిచిపోయింది. వారు కారును నిలిపి టైరుమారుస్తుండగా...అటువైపు వచ్చిన చంద్రశేఖర్ మీద అనుమానం వచ్చింది. (ఏపీ28డీడబ్ల్యు4667) వెనుక సీటులో 8 ఏళ్ల ఓ బాలిక అతి కిరాతకంగా హత్యకు గురై ఉండటం, కారులోంచి రక్తం కారుతుండాన్ని చూసి వెంటనే వారు డయల్ 100కి సమాచారం అందజేశారు.

నిందితుడి అరెస్ట్..రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారును పరిశీలించగా కారు డిక్కీలో బాలిక మృతదేహం లభించింది. నిందితుడు చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. భార్యపై కోపంతోనే తాను బిడ్డను చంపాల్సి వచ్చిందని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ భీంరెడ్డి శనివారం వనస్థలిపురం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్, కరుణాకర్‌రెడ్డిలు ఉన్నారు.



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్

బీఆర్ఎస్‌లోకి తలకొండపల్లి జెడ్పీటీసీ

- మంత్రి కేటీఆర్ సమక్షంలో ఉప్పల వెంకటేశ్ చేరిక

తలకొండపల్లి: ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బీఆర్ఎస్ గూటికి చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం మంత్రి కేటీఆర్ సమక్షంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సింగిల్‌విండో చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో డైరెక్టర్లు, సుమారు 500 మంది నాయకులతో కలిసి పార్టీలో చేరారు. మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కల్వకుర్తిలో టికెట్ ఎవరికీ కేటాయించలేదని, అధిష్టానానిదే తుది నిర్ణయమన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అనంతరం జెడ్పీటీసీ వెంకటేశ్ కొన్ని సమస్యలను మంత్రికి విన్నవించగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, వెల్దండ జెడ్పీటీసీ విజితారెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, ఎంపీపీ నిర్మల, ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, వైస్ చైర్మన్ రవికుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా 5కే రన్



ఓట్ ఫర్ షూర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

- ఓటింగ్ ప్రాముఖ్యతపై అవగాహన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటింగ్ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వీలుగా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో శనివారం 'ఐ ఓట్ ఫర్ షూర్' నినాదంతో ఉదయం 6 గంటలకు నిర్వహించిన 5కే రన్ ఉత్సాహంగా సాగింది. వివిధ శాఖల అధికారులతో పాటు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో అధికారులు అన్ని వర్గాల వారిని భాగస్వాములను చేస్తూ 5కే రన్ విజయవంతం చేశారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఆర్డీవోలు, డిప్యూటీ కమిషనర్లు ఈ రన్‌లో పాల్గొన్నారు.

బర్త్‌డే వేడుక.. బదిలీ కానుక



విద్యార్థులతో కలిసి పాఠశాలలో పుట్టిన రోజు వేడుక జరుపుకొంటున్న ఉపాధ్యాయుడు

షాద్‌నగర్ రూరల్: విద్యార్థులతో పుట్టిన రోజు వేడుకలు చేయించుకున్న ఉపాధ్యాయుడితో పాటు ఇందుకు అనుమతిచ్చిన హెచ్‌ఎంపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నారాయణ పుట్టిన రోజు సంబరాలను ఈనెల 8న విద్యార్థుల సొంత ఖర్చులతో నిర్వహించారు. స్కూల్‌లో నిర్వహించిన ఈ వేడుకకు అవసరమైన డెకరేషన్, కేక్ తదితర ఏర్పాట్లను విద్యార్థులే సమకూర్చారు. ద్విచక్రవాహనాలపై వెళ్లి కేక్ కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఈ తతంగమంతా హెచ్‌ఎం జయప్రద అనుమతితోనే జరిగింది. విషయం తెలిసిన గ్రామస్తులు కలెక్టర్‌తో పాటు డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఎంఈఓ శంకర్ రాథోడ్ ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం జయప్రదను జిల్లేడు చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్లకు, నారాయణను కడ్తాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడికి రిమాండ్

శంకర్‌పల్లి: పదో తరగతి బాలికను కిడ్నాప్ చేసి, లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని శనివారం మోకిల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. మోకిలకు చెందిన ఆసిఫ్(25) కొంత కాలంగా ఇదే గ్రామంలో నివసిస్తున్న బాలికను కిడ్నాప్ చేశాడు. పది రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లి.. లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు ఆసిఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

దరఖాస్తుల జోరు

- మద్యం దుకాణాలకు అప్లికేషన్ల వెల్లువ
- ఒక్కో షాపునకు సగటున 92..
- సరూర్‌నగర్ ఎక్సైజ్ జోన్‌లో 10,994
- శంషాబాద్‌లో ఎక్సైజ్ జోన్‌లో 10,611

దరఖాస్తులు ఇలా..

ఎక్సైజ్‌జోన్	షాపులు	వచ్చిన దరఖాస్తులు
సరూర్‌నగర్	134	10,994
శంషాబాద్	100	10,611
వికారాబాద్	59	2,637
మేడ్చల్	114	7,519
మల్కాజిగిరి	88	6,722
హైదరాబాద్	80	3,626
సికింద్రాబాద్	99	3,549

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మద్యం వ్యాపారులు దరఖాస్తులతో కిక్కెక్కించారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా దరఖాస్తులను స్వీకరించారు. దీంతో జిల్లాలో మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలకు మొత్తం 1,31,954 దరఖాస్తులు రాగా, వీటిలో ఒక్క రంగారెడ్డి జిల్లా నుంచే 234 షాపులకు 21,605 దరఖాస్తులు అందడం విశేషం. ఒక్కోషాపునకు సగటున 92 దరఖాస్తులు అందడం విశేషం. వీటిలో అత్యధికంగా సరూర్‌నగర్ ఎక్సైజ్ జోన్ నుంచి 10,994 దరఖాస్తులు రాగా, శంషాబాద్ ఎక్సైజ్ జోన్ నుంచి 10,611 రావడం గమనార్హం. ఈ దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి జిల్లా నుంచి రూ.432.10 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం.

భూ సమస్యలపై పోరాడుతాం



భూ న్యాయ శిబిరంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

- లీఫ్స్ అధ్యక్షుడు భూమి సునీల్‌కుమార్

మంచాల: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని లీఫ్స్ (లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ) అధ్యక్షుడు భూమి సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఆరుట్లలో శనివారం లీఫ్స్ గ్రామీణ న్యాయ పీఠం, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం ఆధ్వర్యంలో భూ న్యాయ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని 20 గ్రామాల్లో భూ న్యాయ శిబిరాలు నిర్వహించినట్టు తెలిపారు. భూ రికార్డులను ధరణిలో తప్పులతడకగా నమోదు చేశారని.. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ చట్టాలను సమీక్షించి ఒకేఒక 'టైటిల్ గ్యారంటీ చట్టం' తేవాలన్నారు. ఏపీలో ఈ చట్టం అమలు కోసం అసెంబ్లీలో కూడా ఆమోదం తెలిపారని, గవర్నర్ ఆమోదం కోసం పంపించారని గుర్తు చేశారు. తెలంగాణలోనూ భూ సమస్యలు పరిష్కారం కావాలంటే ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతి శనివారం 'న్యాయగంట' పేరుతో సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు రైతులకు ఉచిత న్యాయ సలహాలు అందించనున్నట్లు చెప్పారు. రైతులు 90002 22674 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు పొందొచ్చని సూచించారు. రైతుల సమస్యలు తెలుసుకొని హైకోర్టు న్యాయ వాదుల సహకారంతో 33 జిల్లాల్లో 100 సాగు న్యాయ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరుట్లలోనూ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వం, ప్రతిపక్షాలకు ఒక భూ మేనిఫెస్టో తయారు చేసి ఇస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కరుణాకర్‌దేశాయ్, లీఫ్స్ సంస్థ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, న్యాయవాదులు మల్లేష్, రవి, సందీప్, అభిలాష్, కరుణాకర్, దయాకర్, ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ కడుపు చల్లగా..



గాంధీ ఆస్పత్రిలో తల్లీబిడ్డల ఆరోగ్య కేంద్రం నేడు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన ఎంసీహెచ్ భవనం

- అందుబాటులోకి 200 సూపర్ స్పెషాలిటీ పడకలు
- ఆధునిక సదుపాయాలు, ఆత్యాధునిక వైద్య యంత్రాలు
- రాష్ట్రంలో హైరిస్క్ ప్రసవాలకు కేంద్ర బిందువు
- తగ్గనున్న మాతాశిశు మరణాలు

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): మహిళకు మాతృత్వం దేవుడిచ్చిన వరం. నవమాసాలు మోసిన శిశువు పురిట్లోనే మృతి చెందితే ఆ తల్లి పడే ఆవేదన వర్ణనాతీతం. మరికొన్ని ఘటనల్లో శిశువు పుట్టిన వెంటనే తల్లి మరణిస్తోంది. హైరిస్క్ ప్రసవాలకు కేంద్రబిందువుగా నిలిచి తల్లీబిడ్డలను అక్కున చేర్చుకునేందుకు సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఆదివారం నుంచి అందుబాటులోకి రానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో (మ్యాచింగ్ గ్రాంట్) రూ. 60 కోట్ల వ్యయంతో నిర్మించిన మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్)లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ, ఆధునిక వసతులు, ఆత్యాధునిక వైద్యయంత్రాలతో గర్భిణులు, బాలింతలు, శిశువులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. నేటి ఉదయం మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఎంసీహెచ్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు.



అత్యాధునిక ఆపరేషన్ థియేటర్

మాతాశిశువులకు అభయహస్తం..

గ్రౌండ్ ప్లస్ ఏడు అంతస్తుల్లో నిర్మించిన మాతాశిశు సంరక్షణ కేంద్రంలో రెండు వందల పడకలు అదనంగా అందుబాటులోకి వస్తాయి. సుమారు రూ.10 కోట్లతో ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, వైద్యయంత్రాలను సమకూర్చారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే హైరిస్క్ ప్రసవాలను ఇక్కడే నిర్వహించి తల్లీ బిడ్డల ప్రాణాలు కాపాడతారు. నవజాత శిశువుల కోసం మదర్ మిల్క్ బ్యాంకు, కంగారు మదర్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఆస్పత్రి ప్రధాన భవనంలో కొనసాగుతున్న గైనకాలజీ, పీడియాట్రిక్ విభాగాలను ఎంసీహెచ్ భవనంలోకి తరలించి, తల్లీ బిడ్డలకు ఒకేచోట మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. న్యూరాలజీ, యూరాలజీ వార్డులను అదనంగా ఏర్పాటు చేశారు. గైనకాలజీ, పీడియాట్రిక్, అనస్థీషియా వంటి అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యులు నిరంతం అందుబాటులో ఉంటారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో నెలకు సుమారు 800 ప్రసవాలు జరుగుతుండగా, ప్రస్తుతం రెట్టింపు అవుతాయని ఆస్పత్రి వైద్య వర్గాలు పేర్కొన్నాయి.

అయిదో అంతస్తులో ఫెర్టిలిటీ సెంటర్..

పిల్లల కోసం తల్లడిల్లే వారికి ఎంసీహెచ్ భవనంలోని అయిదో అంతస్తులో ఫెర్టిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అత్యాధునిక వైద్య యంత్రాలను సమకూర్చారు. ప్రైవేటు ఫెర్టిలిటీ సెంటర్లు లక్షలాది రూపాయలు దోచుకుంటున్నాయని, గాంధీ ప్రభుత్వ ఫెర్టిలిటీ సెంటర్‌లో పైసా ఖర్చు లేకుండా మాతృత్వపు రుచి చూపిస్తామని వైద్యులు స్పష్టం చేశారు.

ఆధునిక హంగులతో డైట్ క్యాంటీన్ భవనం

గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.2.75 కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో నిర్మించిన డైట్ క్యాంటీన్ భవనాన్ని మంత్రి హరీష్‌రావు ప్రారంభిస్తారు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్న రోగులతో పాటు సేవలు అందిస్తున్న వైద్యులకు డైట్ క్యాంటీన్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను సరఫరా చేస్తారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో రెండు దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న డైట్ క్యాంటీన్ సమస్య పరిష్కారం కానుంది.

అంతస్తుల వారీగా అందించే వైద్యసేవలు

- గ్రౌండ్ ఫ్లోర్: ఓపీ, ప్రసూతి విభాగాలు, రిజిస్ట్రేషన్, హెల్ప్‌డెస్క్
- మొదటి అంతస్తు: హై డిపెండెన్సీ యూనిట్, లేబర్ డెలివరీ రికవరీ విభాగం
- రెండో అంతస్తు: ఐసోలేషన్ గదులు, లేబర్ డెలివరీ విభాగం
- మూడవ అంతస్తు: పేయింగ్ రూమ్స్, యాంటినెటల్ వార్డు
- నాలుగో అంతస్తు: పేయింగ్ రూమ్స్, పోస్టునెటల్ వార్డు
- ఐదో అంతస్తు: ఫెర్టిలిటీ సెంటర్, ఎస్ఎన్‌సీయూ, ఎస్ఐసీయు, కంగారు మదర్ రూమ్ (కేఎంసీ)
- ఆరో అంతస్తు: ఎంఐసీయూ, పోస్టు ఆపరేటివ్ వార్డు
- ఏడవ అంతస్తు: సీఎస్ఎస్‌డీ, పోస్ట్ ఆపరేటివ్ వార్డులు, ఆపరేషన్ థియేటర్లు



ప్రసూతి వార్డు

తెలంగాణకు మణిమకుటం ఎంసీహెచ్

మదర్ చైల్డ్ హెల్త్ కేర్ (ఎంసీహెచ్) ఆరోగ్య కేంద్రం తెలంగాణకు మణిమకుటం. రాష్ట్రవ్యాప్తంగా హైరిస్క్ ప్రసవాలను ఇక్కడే నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేస్తాం. ఎంసీహెచ్‌తో గాంధీలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుల నేతృత్వంలో తెలంగాణలో ప్రభుత్వ వైద్యం ఎంతో అభివృద్ధి చెంది, సామాన్య ప్రజల నమ్మకాన్ని సాధించింది. మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవతో ఎంసీహెచ్, డైట్ క్యాంటీన్ భవన నిర్మాణం పూర్తయ్యాయి.

– రాజారావు, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్

రూ.30 లక్షల విలువైన బంగారం పట్టివేత



శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న రూ.30 లక్షల బంగారాన్ని శనివారం కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. బ్యాంకాక్ నుంచి శంషాబాద్ వచ్చిన ప్రయాణికుడి సెల్ ఫోన్ పవర్ బ్యాంక్‌ను తనిఖీ చేయగా బంగారం లభించింది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



పారిశుద్ధ్య కార్మికులకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

హుడాకాంప్లెక్స్: న్యాయమైన పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట శనివారం పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరసనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో కార్మికులు, కర్షకులు, కష్టజీవులు సమ్మెకు దిగితే ఎంత పెద్ద ధనవంతులైనా దిగి రావాల్సిందేనని పేర్కొన్నారు. సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలైనా కాలగర్భంలో కలిసిపోవాల్సిందేనని అన్నారు. కరోనా విపత్తులో పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని వేతనాలు పెంచడంతో పాటు హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి, సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిక్కుళ్ల శివప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో రోగుల సౌకర్యార్థం బ్యాటరీ కార్లు



లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో ట్రాఫిక్ సమస్యతో పాటు శబ్ద, వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు బ్యాటరీ కార్లను ప్రవేశపెట్టినట్టు ఆస్పత్రి సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. రోగుల సౌకర్యార్థం వీటిని ఉపయోగించనున్నామన్నారు. శనివారం నాలుగు బ్యాటరీ వాహనాలకు ఆయన మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిమ్స్ బ్రాంచ్ సమకూర్చిన బ్యాటరీ కార్లతో పాటు అవసరమైతే మరిన్నింటిని అందుబాటులోకి తీసుకురానున్నామని, ఇందుకు పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ కేవీ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎన్. లక్ష్మీ భాస్కర్, నెఫ్రాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ స్వర్ణలత, డాక్టర్ సాయిబాబా, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్, మీడియా ఇన్‌చార్జి సత్య గౌడ్, డిప్యూటీ రిజిస్ట్రార్ పి. రాజ్ కుమార్, ఔట్‌సోర్సింగ్ విభాగం సూపర్‌వైజర్ రాము తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి.. కారు పల్టీ

యజమాని మృతి, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: అతివేగంగా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో యజమాని మృతి చెందగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రఘువీర్‌రెడ్డి కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా, చింతలపాలెం మండలం మల్‌రెడ్డిగూడ గ్రామానికి చెందిన ఉప్పతల నర్సింహారావు రియల్ ఎస్టేట్ వ్యాపారి. శుక్రవారం రాత్రి తన కారులో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా.. ఎగ్జిట్ నంబర్ 12 వద్దకు రాగానే అదుపు తప్పిన కారు డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నర్సింహారావుకు రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ చింతల నారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

గరిడేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న లారీ మార్గమధ్యలో గరిడేపల్లి మండలం రాయినిగూడెం వద్దకు రాగానే మరమ్మతుకు గురైంది. దీంతో డ్రైవర్ వాహనాన్ని అక్కడే నిలిపివేశాడు. ఈ క్రమంలో షాద్‌నగర్ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న లారీ ఎలాంటి సిగ్నల్ లేకుండా చీకటిలో ఆపి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఢీకొట్టిన లారీ డ్రైవర్ రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం కలకొండ గ్రామానికి చెందిన పులి పరమేష్(35) క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.